లింగంపల్లి - ఘట్‌కేసర్ మధ్య నేటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం

ఖైల్‌కాలనీ/కుషాయిగూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ రైలు సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ తొమ్మిది బోగీలతో గల ఎంఎంటీఎస్ రైలు రెండు ట్రిప్పులు తిరిగే విధంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా రైలు ట్రిప్పులను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎంటీఎస్ సమయం వివరాలు..

ప్రారంభం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ నుంచి ఉదయం 10.45కి ఎంఎంటీఎస్ బయలుదేరి చర్లపల్లికి 10.59గంటలకు, నేరేడ్‌మెట్‌కు 11.21కి, అమ్ముగూడకి 11.29కి, భూదేవీనగర్‌కు 11.36కి, సుచిత్ర సెంటర్‌కు 11.45కి, ఫిరోజ్‌గూడ 11.54కు, భరత్‌నగర్ 12.03కు, బోరబండ 12.07కు, హైటెక్‌సిటీకి 12.12, హఫీజ్‌పేట్‌కి 12.18, చందానగర్‌కి మధ్యాహ్నం 12.23, లింగంపల్లికి 12.40కి చేరుతుంది.

'శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి'

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఈ నెల 6 నుంచి ఆరు రోజుల పాటు కీసరగుట్టపై జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో ఆయా శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని, 56 సీసీ కెమెరాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు సౌకర్యంలో భాగంగా 300 బస్సులు జాతరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు.

అపోలో ఆస్పత్రిలో మహిళకు కార్-టీ సెల్ థెరపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి కార్ - టీ సెల్ థెరపీని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళా రోగి కొంతకాలంగా మల్టీపుల్ మైలోమా (బ్లడ్ కేన్సర్ కండిషన్)తో బాధపడుతున్నది. ఆమె ఇటీవల అపోలో కేన్సర్ సెంటర్ వైద్యుల వద్దకు రాగా, ఆమెకు వైద్య పరీక్షలు చేసి కేవలం కార్-టీ థెరపీ ద్వారానే చికిత్స అందించడానికి అవకాశముందని నిర్ధారించుకుని వైద్య ప్రక్రియను ప్రారంభించారు. చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టీ-సెల్ (కార్-టీ) థెరపీని విజయవంతంగా నిర్వహించి కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి మరో మైలురాయిని చేరుకుందని అపోలో కేన్సర్ సెంటర్ హెమటాలజిస్ట్, బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి చెప్పారు. అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడంలో తమ ఆస్పత్రి ముందంజలో ఉంటున్నదన్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తోపాటు 24వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధనకోసం మహాధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. ఇరవై సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదువేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ టీచర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత జరిగిన ధర్నాలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, రామకృష్ణ, నరసింహా గౌడ్, పోతులారం కృష్ణ, ప్రీతమ్, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ జయంతితోపాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు వేతనాలు పెంచాలి'

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ రెండో వేతన సవరణ కమిషన్ కమిషనర్ శివశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు గత వేతన సవరణల్లో జరిగిన అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వేతనసవరణ కమిషన్‌ను కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లకు వృత్తిపరంగా ఉన్న రిస్క్ ఫ్యాక్టర్స్ వల్ల కలిగే జీవితకాల ఆరోగ్య ప్రమాదాలకై, విద్య వైద్యం కోసం ప్రత్యేక అలవెన్సు మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడంతస్తుల మేడపై నుంచి పడి వృద్ధురాలి మృతి



శారద బెన్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉతికిన దుస్తులు ఆరేస్తూ మూడంతస్తుల మేడ పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో ఇతీష్ కుమార్ కుటుంబం నివాసం ఉంటున్నది. సోమవారం ఇంట్లోని వారంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఇతీష్‌కుమార్ తల్లి శారద బెన్(70) మూడంతస్తుల భవనంపై దుస్తులు ఆరవేస్తుండగా కళ్లు తిరిగి పై నుంచి కింద పడింది. మృతిచెందింది. శబ్దం రావడంతో నాలుగో అంతస్తులోని భావన పటేల్ బయటకు వచ్చి చూసి ఇతీష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇతీష్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ భాను ప్రకాశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నగరంలో టానిక్ లిక్కర్స్ సెంటర్లలో వాణిజ్య పన్నుల శాఖ సోదాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టానిక్ లిక్కర్స్ గ్రూప్‌నకు చెందిన షాపులు, వాటి అనుబంధ సంస్థలలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలతో పాటు నగరంలో సుమారు 10చోట్ల సోదాలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న బ్రాండ్స్‌కు సంబంధించి కొనుగోలు వివరాలు.. ఎప్పుడు ఆర్డర్ ఇచ్చారు.. ఎక్కడి నుంచి సరఫరా అయింది? వాటికి సంబంధించిన లేబుల్స్ వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు వివరించిన తర్వాత తదుపరి చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు.

విదేశాలకు తల వెంట్రుకలు ఎగుమతిలో అక్రమాలు

- ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తల వెంట్రుకలు(జుట్టు) ఎగుమతి చేసి కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించింది. జుట్టు అక్రమ ఎగుమతులపై ఈడీ నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 17 మందిపై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును గత ఆగస్టు 21న నాంపల్లి పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఇటీవలే అనుమతించినట్లు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గంలో మయన్మార్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాంకు ఎగుమతి చేసినట్లు లభించిన ఆధారాల మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ పలు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో రూ. 1.21 కోట్లు లెక్కలోలేని నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ. 7.85 కోట్లు ఫ్రీజ్ చేసింది.

సమస్యల మధ్యే చదువులు

- శిథిలావస్థకు చేరిన సర్కారు బడి భవనం
- ఎప్పుడు కూలుతుందోనన్న భయంలో విద్యార్థులు

సర్కారు బడిలో ఎన్ని సమస్యలున్నా విద్యార్థులు సర్దుకుపోతున్నారు. ఇరుకు గదుల్లోనే రెండు, మూడు తరగతులు కొనసాగుతున్నాయి. తరగతి గదులు కూడా పెచ్చులూడి వర్షం వస్తే కారే దీనస్థితికి చేరుకున్నాయి. ఇక్కడ చదువుకునేది మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల పిల్లలే. కానీ ఎవరికి చెప్పినా సమస్యలు పరిష్కారం కావు. సర్కారు బడుల సమస్యలు పట్టించుకునే నాథుడే లేరా.. ఇక ఇంతేనా.. అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ బడులకు పెద్దపీట వేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతున్న నాయకులు ఆ వైపు కృషి చేయడం లేదు. మన ఊరు, మనబడి కార్యక్రమం ద్వారా నిధులు మంజూరైనా గాజులరామారం గ్రామంలోని బడి మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.



ఊడి పడుతున్న స్లాబ్ పెచ్చులు

గాజులరామారం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ గాజుల రామారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అన్నీ సమస్యలే తాండవిస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందోననే భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడ 1 నుంచి 5వ తరగతి వరకు 188 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 94 మంది ఇంగ్లిష్ మీడియం, 94 మంది తెలుగులో విద్య నభ్యసిస్తున్నారు. విద్యార్థులకు కనీసం కూర్చోవడానికి తరగతి గదుల్లో ఫ్లోరింగ్ కూడా లేదు. నేల మీదనే తమ చదువులను కొనసాగిస్తున్నారు.

మన ఊరు.. మన బడికి ఎంపికైన పాఠశాల

గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి ద్వారా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. నూతన భవనం నిర్మించేందుకు రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. కానీ అప్పటి నుంచి ఏ ఒక్క అధికారి కూడా ఈ బడిని పట్టించుకోలేదు. మంజూరైన నిధులలో స్కూల్‌లో విద్యుత్ కోసం కొంత నిధులు ఖర్చు చేశారు. మిగిలిన నిధులు అలాగే ఉన్నాయి. గతంలో ఉపాధ్యాయులు కూడా ఈ విషయంపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి స్కూల్‌ను బాగుచేయాలని వినతిపత్రం సమర్పించారు. అయినా ఎలాంటి పనులూ చేపట్టలేదు. వర్షం వచ్చిందంటే పెచ్చులూడిన స్లాబ్‌ల నుంచి నీరు కారి తరగతి గదులు తడిసిపోతున్నాయి. పెచ్చులూడి విద్యార్థుల మీద పడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయని విద్యార్థులు అంటున్నారు. స్కూల్ గోడలకు ఎక్కడ చూసినా పగుళ్లు వచ్చి పాకురుపట్టాయి.

188 మంది విద్యార్థులకు నాలుగే టాయిలెట్స్

రామారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 188 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కనీసం వారి కాలకృత్యాలు తీర్చుకునేందుకు టాయిలెట్స్ కూడా సరిగ్గాలేవు. టాయిలెట్స్ గదుల్లో శుభ్రం చేసేవారు లేక విద్యార్థులు ముక్కు మూసుకొని వెళ్లాల్సివస్తోంది. రోడ్డుపై వెళ్లే వారు కూడా ఇక్కడ ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులు చదువుకుంటున్న బడులు మాత్రం బాగుపడడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



ముక్కు, మూసుకొని టాయిలెట్‌కు వెళ్తున్న విద్యార్థులు



శిథిలావస్థకు చేరిన పాఠశాల

నిధులు మంజూరు కాగానే పనులు

రామారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మన ఊరు - మన బడికి ఎంపికైంది. పనులను చేపట్టేందుకు టెండర్లను పిలిస్తే ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రావడంలేదు. దీంతో పనులు చేపట్టేందుకు ఆలస్యం అవుతోంది. అదనపు గదుల నిర్మాణానికి కూడా ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాలేదు. నిధులు రాగానే పనులు మొదలు పెడతాం.

- ఆంజనేయులు, ఎంఈవో

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- 745 గ్రాములు స్వాధీనం

చందానగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి 745 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాపిరెడ్డికాలనీలో రాజేష్ అనేవ్యక్తి గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై రఘు ఆధ్వర్యంలో దాడులు చేసి అతడిని అరెస్టు చేశారు. రాజేష్ నుంచి 745 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి పాపిరెడ్డికాలనీ పోచమ్మ ఆలయం సమీపంలో ఉన్న తన ఇంటిలోనే విక్రయిస్తున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఉష'లో జేఎన్‌టీయూ విద్యార్థినికి కాంస్యం



పవిత్రను అభినందిస్తున్న వీసీ నర్సింహారెడ్డి, దిలీప్

హైదరాబాద్ సిటీ, మార్చి4 (ఆంధ్రజ్యోతి): చైనీస్ మార్షల్ ఆర్ట్స్ 'ఉషు' జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ విద్యార్థిని పొడగంటి పవిత్ర కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాకు చెందిన పొడగంటి పవిత్ర ప్రస్తుతం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల జమ్మూ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ 'ఉష' పోటీలో కాంస్య పతకం గెలుపొందింది. అలాగే గత నెలలో జార్ఖండ్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ పోటీల్లో పవిత్ర ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. పవిత్రను సోమవారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ దిలీప్, కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నేతలు



ఈటలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేరిక కమిటీ చైర్మన్, పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కూకట్‌పల్లికి చెందిన బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈటల రాజేందర్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకొంటామని కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తెలిపారు. నాయినేని సూర్యప్రకాష్‌రావు, నాయినేని పద్మారావు, వడ్డేపల్లి శ్రీనివాసరావు, అనంతనాగరాజు, దిలీప్, వెంకటేష్, ఉదయ్, రాఘవేందర్, బాలరాజు పాల్గొన్నారు.

మెరుగైన పట్టణ భవిష్యత్తే లక్ష్యం: కొండా



అసోసియేషన్ సభ్యులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. హోటల్ దసపల్లాలో శేరిలింగంపల్లి కమ్యూనిటీకి చెందిన రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. మెరుగైన పట్టణ భవిష్యత్తే తన లక్ష్యమన్నారు. అందుకోసం మేనిఫెస్టోను వచ్చే వారంలోపు విడుదల చేస్తానన్నారు.

'పోటెత్తిన గృహజ్యోతి దరఖాస్తుదారులు'

కుత్బుల్లాపూర్: ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నా తమకు జీరో విద్యుత్ బిల్లులు ఎందుకు రాలేదని దరఖాస్తుదారులు కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి సోమవారం పోటెత్తారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేస్తూ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు అటు, ఇటు తిప్పుతూ సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తుదారులు కార్యాలయానికి రావడంతో అధికారులకు, సిబ్బందికి ఇబ్బంది పడ్డారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి,మార్చి 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతిపత్రం సోమవారం అందజేశారు. అనంతరం కమిషనర్‌తో ఆయన సమావేశమై నియోజకవర్గ ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా అన్నీ డివిజన్లలోని నాలాలను యుద్ధప్రాతిపాదికన అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, శిరీష, సబీహాబేగం, సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.

అల్లాపూర్: అల్లాపూర్ డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి పనుల పట్టికను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు కార్పొరేటర్ సబీహాబేగం అందజేశారు. అల్లాపూర్ ప్రధాన రహదారి విస్తరణ, గాయత్రినగర్ నుంచి యూసుఫ్‌నగర్ రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణం వంటి ప్రధాన పనులతో పాటు లక్ష్మీనగర్ నుంచి సఫ్దర్‌నగర్ వరకు నాలా నిర్మాణం, సున్నం చెరువు, మైసమ్మ చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, తదితర పనులు చేపట్టాలని కార్పొరేటర్ తన వినతి పత్రంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విన్నవించారు.

- **హైదర్‌నగర్:** ఆల్విన్‌కాలనీ డివిజన్ సమస్యలు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు కలిసి వివరించారు.

డిగ్రీ కళాశాలలో ఆకట్టుకొన్న ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కూకట్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కళాశాలకు చెందిన భాషా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వైస్‌ప్రిన్సిపాల్ డా.బి.భవాని ప్రారంభించా రు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఆహార ఉత్పత్తులను పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్‌బాబు, పి.సురేష్‌బాబు, రాఘవేందర్‌రావు, సుజాత, శోభారాణి, దయానంద్, రవికుమార్, వాణి, వినోద్‌కుమార్, శ్రీనివాసరావు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతాలోపంపై ప్రజావాణిలో ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్, అధికారులు

గాజులరామారం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కాలనీ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడం లేదని ప్రజావాణిలో కాలనీ అసోసియేషన్ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని మహాదేవపురం కాలనీ, కమలమ్మనగర్‌కాలనీల్లో బాక్స్ నాలా పనులు కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించాడు. మహాదేవపురం చౌరస్తాలో డ్రైనేజీ పనుల్లో మ్యాన్‌హోల్స్ కుండీలకు నాణ్యంగా నిర్మించకుండా మట్టి నింపి వదిలి వేశాడని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

- **కూకట్‌పల్లి:** మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఐదు సర్కిళ్ల నుంచి 58 ఫిర్యాదులందాయి. రోడ్లు, టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, పార్కులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా అందాయి.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో వేర్వేరుగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 10 ఫిర్యాదులు అందగా వాటిలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా, తదితర ఫిర్యాదులందాయి. కార్యక్రమాల్లో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, ఎల్‌పీ మల్లయ్య, ఏఎంసీలు ఉదయ్‌కుమార్, డీసీపీలు సాయిబాబా, సంతోష్‌కుమార్, ఈఈ కృష్ణ చైతన్య, ఏఎంవోహెచ్ భార్గవ నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగ్లాదేశీయులను మోసగించి నగదు అపహరణ

రాయదుర్గం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం నగరానికి వచ్చిన బంగ్లాదేశీయులను కొందరు వ్యక్తులు మోసం చేసి వారి వద్దనున్న నగదును అపహరించారు. ఈ సంఘటన రాయదుర్గం పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2వ తేదీన బంగ్లాదేశ్‌కు చెందిన హర్షబుల్ హక్ వైద్యం కోసం అతడి బంధువులు మజిపర్ రెహమాన్, లతిఫర్ రెహమాన్ నగరానికి వచ్చి గచ్చిబౌలి పీజేఆర్‌నగర్‌లోని ఓ గెస్ట్‌హౌస్‌లో దిగారు. అనంతరం 3వ తేదీన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం హర్షబుల్‌ను తీసుకుని వెళ్లి వైద్యం చేయించుకున్నారు. తిరుగు ప్రయాణంలో గెస్ట్‌హౌస్‌కు ఆటోలో వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు అడ్డుకుని ఆటోలో గంజాయి ఉందని సమాచారం ఉందని చెక్‌చేయాలని చెప్పి వారి దింపి చెక్‌చేస్తున్నట్లు నటిస్తు వారి బ్యాగ్‌లోని ఒక లక్షా 61 వేల బంగ్లాదేశ్ కరెన్సీ (రూ.51 వేల భారత కరెన్సీ)ని దోచుకున్నారు. అనంతరం వారు ఆటోఎక్కి బ్యాగులో చూడగా డబ్బులు కనిపించలేదు. దీంతో వారు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు.

కల్వర్టు పనులను పరిశీలించిన కార్పొరేటర్

చందానగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలోని కైలాష్‌నగర్ కల్వర్టు నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ మంజులరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమీన్‌పూర్‌కు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఇబ్బందులు లేకుండా కల్వర్టు నిర్మిస్తున్నామని తెలిపారు. పనులు త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త వార్తలు



జడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

హైదర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ సర్వేనెంబర్ 57, 336 సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని ప్రజావాణిలో ఆల్విన్‌కాలనీ వాసులు జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, నాయకులు మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, కేశవరావు, అరుణ్‌కుమార్, మణిభూషణ్, రఘు, సంతోష్, ప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, అనూష, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

ఘనంగా యంగ్ ఇన్నోవేటివ్ ఛాలెంజ్

హైదర్‌నగర్: యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో నిర్వహిస్తున్న ట్రయిల్ బేజర్ కమ్యూనిటీ ల్యాబ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మబండలో యంగ్ ఇనోవేటివ్ ఛాలెంజ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జీహెచ్‌ఎస్ తెలుగు మీడియం, జడ్పీహెచ్‌ఎస్ శంషీగూడ పాఠశాల విద్యార్థులు రూపొందించిన నమూనాలు ప్రదర్శించారు. మొదటి బహుమతి గోల్కొండ జీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులు, రెండో బహుమతి శంషీగూడ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు గెలుచుకున్నారు. యునైటెడ్ మేనేజర్ రాములు, అసోసియేట్ ప్రశాంత్, ప్రాజెక్టులీడ్ రమేష్, రాజేష్, శ్రీపతి, మాధవి, హరీష్, కృష్ణ, సంపతి పవన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్: ప్రజా సమస్యలను స్టాండింగ్ కమిటీలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను నాయకులు, కాలనీ ప్రతినిధులు సోమవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మయూరినగర్ కాలనీవాసులు చంద్రిక, జహంగీర్, కృష్ణ, ప్రవీణ్‌రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, హరిబాబు, సుధీర్, క్రాంతి, అంజన్, సంతోష్, గోపాల్‌రెడ్డి, హరిబాబు, వరప్రసాద్, సాహిత్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుడికి నష్టపరిహారం

ఫతేనగర్: పది రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన సెంట్రింగ్ కార్మికుడు నారాయణ కుటుంబాన్ని ఆదుకుంటామని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ హామీ ఇచ్చారు. నారాయణ పని చేసే బిల్డర్‌తో మాట్లాడి రూ.15 లక్షల నష్ట పరిహారాన్ని కార్మికుడి కుటుంబసభ్యులకు ఇప్పించారు. కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, తూము సంతోష్, విట్టల్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ, నాగమల్లి సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం పని చేయాలి

గచ్చిబౌలి: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం కొండాపూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్‌లో పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నందు, గోపాల్‌గౌడ్, గణేష్, రవియాదవ్, వినయ్‌రెడ్డి, వెంకటస్వామి, అప్పల్‌కుమార్‌యాదవ్, యోగిరెడ్డి, యాదయ్యగౌడ్, రవికుమార్ పాల్గొన్నారు.

- హఫీజ్‌పేట డివిజన్ రామకృష్ణనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు విష్ణురెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రోడ్డు ఆక్రమణలను తొలగించండి

జీడిమెట్ల: జగద్గిరిగుట్ట ప్రాంతంలో రోడ్డు ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. సీనియర్ నేత ఏసురత్నం ఆధ్వర్యంలో గాజులరామారం సర్కిల్‌ఉపకమిషనర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు.